అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

ఘనంగా అయ్యప్ప పడి పూజ

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి, డిసెంబర్ 2 : నల్లగొండలోని పద్మావతినగర్ కాలనీలో నిర్వహించిన అయ్యప్ప పడి పూజ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరై స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కంచర్ల కృష్ణారెడ్డి, న్యాయవాది జవహర్‌లాల్, గురుస్వాములు కలిశాన్ అశోక్, నోముల శ్యాం పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, డిసెంబర్ 2 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు శనివారం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఆలయ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ పాల్గొన్నారు.

కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు

నల్లగొండ గడ్డపై గులాబీ జెండాదే గెలుపు

- 10వేల మెజార్టీతో గెలువబోతున్నాం
- టికెట్లు అమ్ముకొని ఖర్చుపెట్టిన దొంగ కోమటిరెడ్డి
- బీఆర్ఎస్ నుంచి చెత్త పోయింది.. నిఖార్సయిన కార్యకర్తలే ఉన్నారు
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నీలగిరి, డిసెంబర్ 2 : అవినీతి, డబ్బు సంచులు అభివృద్ధి గెలుపును ఆపలేవని, 10 వేల మెజార్టీతో నల్లగొండ గడ్డపై గులాబీ జెండా ఎగురుతుందని, కార్యకర్తలెవ్వరూ అధైర్యపడొద్దని బీఆర్ఎస్ నల్లగొండ అభ్యర్థి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం లక్ష్మీగార్డెన్స్‌లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భువనగిరి దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కొంతమంది నాయకుల వెన్నుపోటుతో మెజార్టీ తగ్గుతుందని, లేకుంటే 25 వేల మెజార్టీతో గెలుపొందేవాళ్లమని ధీమా వ్యక్తం చేశారు. సైలెంట్ ఓటింగ్‌తో ప్రజలంతా అభివృద్ధికే ఓటేశారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి టిక్కెట్లు అమ్ముకొని వచ్చిన సొమ్ముతో నల్లగొండలో వెన్నుపోటు నాయకులను పశువుల్లా కొన్నాడని, నిఖార్సయిన గులాబీ సైనికులను కొనలేకపోయాడని చెప్పారు. 2018లో సర్వేలన్నీ బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వచ్చాయని, కానీ అత్యధిక మెజార్టీతో కేసీఆర్ సీఎం అయ్యారని, ఇప్పుడు మళ్లీ అదేసీన్ రిపీట్ అవుతదని గుర్తుచేశారు. సీనియర్ నాయకుడు చకిలం అనీల్‌కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని కాపాడే నాయకుడు భూపాల్‌రెడ్డి అని కొనియాడారు. ఒక ఎమ్మెల్యే తలుచుకుంటే నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయొచ్చో చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

7న తులసీనగర్ హనుమాన్ ఆలయంలో గాయత్రి యజ్ఞం

రామగిరి, డిసెంబర్ 2 : నల్లగొండలోని తులసీనగర్ భక్తాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 7న హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు అర్చకులు, పాలకమండలి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యజ్ఞంలో హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు హాజరుకావాలని కోరారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

మేళ్లచెర్వు, డిసెంబర్ 2 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువును ఈ నెల 11 వరకు పొడిగించినట్లు స్థానిక జడ్పీహెచ్ఎస్ సెంటర్ కోఆర్డినేటర్ పొనగండ్ల నారపరెడ్డి, సహాయ కోఆర్డినేటర్ గురుస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో నిలిపిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9848722550 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అల్లీపురం విద్యార్థులు

మఠంపల్లి, డిసెంబర్ 2 : మండలంలోని అల్లీపురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఈ.బ్రహ్మం, బి.కావ్య రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి ఖోఖో టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం సాధించి ఈ నెల 26,27,28తేదీల్లో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిక్రీడలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలి : ఐఎఫ్‌టీయూ

గరిడేపల్లి, డిసెంబర్ 2 : భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నందున ఎవరు అధికారంలోకి వచ్చినా పని సౌకర్యం కల్పించి అండగా నిలవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కార్మికులకు పనులు లేక వారి ఇండ్లు గడవడమే కష్టం అవుతుందన్నారు. కావున ఎవరు అధికారంలోకి వచ్చినా వారికి అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. సమావేశంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

బీబీనగర్, డిసెంబర్ 2: మండలంలోని వెంకిర్యాల లక్ష్మీనారాయణస్వామి ఆలయ పునఃనిర్మాణానికి మాజీ సర్పంచ్ రాచమల్ల నరసింహ కుమారులు బాలకృష్ణ శశికళ, రాజలింగంరేఖ దంపతులు రూ.50 వేలు, ముషీరాబాద్‌కు చెందిన బండారి తిరుమలేష్-విజయలక్ష్మి దంపతులు రూ.1,00,116ల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీపద్మావతి-శ్రీనివాసులు, ధర్మకర్తలకు అందచేశారు.

చందనపల్లి నుంచి కౌంటింగ్ ప్రారంభం

- తిప్పర్తి మండలంతో ముగింపు
- ప్రతి రౌండ్‌కు 14 ఈవీఎంల లెక్కింపు

దుప్పలపల్లి గోదామ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



నీలగిరి, డిసెంబర్ 2 : నల్లగొండ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు అదివారం పట్టణ శివారులోని అనిశెట్టి దుప్పలపల్లి గోదామ్‌లో ప్రారంభంకానుంది. ముందుగా నల్లగొండ మండలంలోని చందనపల్లి నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కించిన అనంతరం బూత్‌ల వారీగా ప్రతి రౌండ్‌కు 14 ఈవీఎంలను లెక్కించనున్నారు. నల్లగొండ మండలం, మున్సిపాలిటీ, తిప్పర్తి, కనగల్ మండలాల్లో మొత్తం 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 21 రౌండ్లలో ఓట్లను లెక్కించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ముందుగా నల్లగొండ మండలంలోని చందననల్లి, చర్లపల్లి, దండెంపల్లి, మర్రిగూడ గ్రామాలను లెక్కించనున్నారు. ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ బలంగా ఉండడంతో అక్కడే భారీ మెజార్టీ రానుంది. రెండో రౌండ్‌లో బుద్దారం, అన్నెపర్తి, అప్పాజీపేట, దోమలపల్లి, కాకులకోండారం, గొల్లగూడెం గ్రామాలను లెక్కింపు జరుగనుంది. మూడోరౌండ్‌లో రాములబండ, కుదావన్‌పూర్, నర్సింగ్ భట్ల, అనంతారం, కొత్తపల్లి లెక్కించనున్నారు. నాలుగో రౌండ్ నుంచి నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మామిళ్లగూడెం నుంచి లెక్కింపు ఉంటుంది. మొత్తంగా నల్లగొండ మున్సిపాలిటీలో 9 రౌండ్లు ఓట్ల లెక్కింపు చేయనున్నారు. 13వ రౌండ్‌లో నల్లగొండ మున్సిపాలిటిలోని కొన్ని పోలింగ్ కేంద్రాలు, నల్లగొండ మండలంలోని ఎం.దుప్పలపల్లి, జీకే అన్నారం, అన్నారెడ్డిగూడెం, రసూల్‌పురం గ్రామాలను లెక్కించనున్నారు. 14వ రౌండ్‌లో రెండు టెబుల్ వద్ద ముషంపల్లి నుంచి కనగల్ ఓట్లను లెక్కించనున్నారు. 15వ రౌండ్‌లో కనగల్ మండల కేంద్రం నుంచి ప్రారంభమై 16, 17 రౌండ్లలో కనగల్ మండలంలోని పలు గ్రామాల్లోని ఓట్ల కౌంటింగ్ జరుగుతుంది. 18వ రౌండ్‌లో తిప్పర్తి మండలంలో ప్రారంభమై 19, 20 రౌండ్లు జరిగి 21వ రౌండ్‌లో నాలుగు టేబుళ్ల వద్ద, చివరిగా పజ్జూర్‌లోని 281 పోలింగ్ కేంద్రం, చిన్నసూరారం, పెద్ద సూరారం గ్రామంతో కౌంటింగ్ ముగియనుంది.

దుప్పలపల్లి గోదామ్ వద్ద పూర్తయిన కౌంటింగ్ ఏర్పాట్లు



సీసీ టీవీలు